రాంగ్ రూట్ డ్రైవింగ్‌పై కేసులు నమోదు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ పట్టణంలో 44 జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా రాంగ్ రూట్‌లో వెళ్లిన 12 మంది వాహనదారులపై కేసులు నమోదు చేసినట్లు మేడ్చల్ ట్రాఫిక్ సీఐ హనుమాన్‌గౌడ్ తెలిపారు. ఆదివారం రాత్రి స్థానిక ముకుంద్ థియేటర్ వద్ద సిబ్బందితో స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన సీఐ నిబంధనలకు విరుద్ధంగా రాంగ్ రూట్‌లో వెళుతున్న వాహనదారులపై చర్యలు చేపట్టారు. వాహనదారులు నిబంధనలు పాటించాలని, రాంగ్ రూట్‌లో వెళ్లడం వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉన్నందున కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మించిన కట్టడాలను సోమవారం కార్పొరేషన్ అధికారులు రెవెన్యూ సిబ్బందితో కలిసి కూల్చివేశారు. ఈ సందర్భంగా కాప్రా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మీ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల రక్షణే ధ్యేయంగా పనిచేస్తున్నామని, ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కాశీరాం, రవి తదితరులు పాల్గొన్నారు.

భార్యాభర్తల మధ్య గొడవ...

- పోలీస్ స్టేషన్‌లో భార్య ఫిర్యాదు
- మనస్తాపంతో ఉరివేసుకుని భర్త ఆత్మహత్య

శామీర్‌పేట్: దంపతుల మధ్య గొడవల నేపథ్యంలో భార్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మనస్తాపానికిలోనైన భర్త ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మూడుచింతలపల్లి మండలం, జగ్గంగూడ – సంపన్‌బోల్ గ్రామానికి చెందిన సార శేఖర్ (42), కు 10 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. భార్య ఇద్దరు పిల్లలతో కలిసి తూంకుంట మున్సిపాలిటీ, పోతాయిపల్లిలో నివాసం ఉంటూ డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండటంతో భార్య శామీర్‌పేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. దీంతో మనస్తాపం చెందిన శేఖర్ సోమవారం సాయంత్రం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం



ఘట్‌కేసర్: ఎన్‌ఎఫ్‌సీ నగర్ రైల్వే వంతెనపై నుంచి దూకి ఓ బీటెక్ విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించింది. ఘట్‌కేసర్ సీఐ సైదులు తెలిపిన వివరాలు... జనగామ జిల్లా దేవరుప్పులకు చెందిన భాషపాక నాగమణి(19) ఘట్‌కేసర్‌లోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటూ అవుషాపూర్ వీబీఐటీ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఏమైందో ఏమో గానీ, సోమవారం ఉదయం ఎన్‌ఎఫ్‌సీ నగర్ రైల్వే వంతెన పైనుంచి ఆమె దూకింది. తీవ్ర గాయాలపాలైన ఆమెను ఖయ్యూం అనే స్థానికుడు గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చాడు. అయితే ఆ వాహనం రాక ఆలస్యం కావడంతో ఖయ్యూం, మరొక వ్యక్తి సాయంతో బైక్‌పై ఆమెను తీసుకెళ్లి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించాడు. వెంటనే వైద్యులు చికిత్స చేశారు. అయితే ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో నగరంలోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. వంతెనపై నుంచి దూకగా ఆమె చెట్లపై పడటంతో గాయాలు తక్కువయ్యాయి. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలి

అదనపు కలెక్టర్ అభిషేక్



సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య అన్నారు. ఇంటింటికి వెళ్లి జ్వర సంబంధమైన కేసులను ముందుగానే గుర్తించి, నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వీధిలో స్ప్రేయింగ్, ఫాగింగ్ కార్యకలాపాలు నిర్వహించటం ద్వారా వ్యాధులు వ్యాప్తి చెందకుండా చూడాలన్నారు. పురపాలక సంఘాల్లో పారిశుద్ధ్య పనులను ముమ్మరం చేయాలని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు, మలేరియా , డెంగ్యూ నిరోధక మాసాలను పాటించటం ద్వారా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ బదిలీ

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) అభిషేక్ ఆగస్త్య ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. రెండేళ్లుగా ఆయన ఇక్కడ అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని 13 పురపాలక సంఘాలు ,61 గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో తన వంతు సేవలను అందించారు. అక్రమ కట్టడాలతో సహా ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలను అరికట్టటంలో కీలకంగా వ్యవహరించారు. ఈయన స్థానంలో జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీ)గా ప్రభుత్వం ఇప్పటి వరకు ఎవరినీ నియమించలేదు.

పంచాయతీ కార్యదర్శుల ఫోరం అధ్యక్షుడిగా భాస్కర్

సాక్షి,మేడ్చల్ జిల్లా: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు రవి ప్రకాష్ అధ్యక్షతన సోమవారం కలెక్టరేట్‌లో పంచాయతీ కార్యదర్శుల జిల్లా ఫోరం ఎన్నికలు జరిగాయి. నోటిఫై చేసిన పోస్టులకు ఒకే ఒక్క సెట్ నామినేషన్లు రావటంతో పరిశీలన తర్వాత అన్ని నామినేషన్లు చెల్లుబాటు అయినట్లు ఎన్నికల అధికారి, టీఎన్‌జీవోస్ కేంద్ర కార్యవర్గ సభ్యుడు శశికాంత్ రెడ్డి ప్రకటించారు. మూడేళ్ల కాలపరిమితితో పంచాయతీ కార్యదర్శుల జిల్లా ఫోరమ్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా పంచాయతీ కార్యదర్శుల ఫోరం అధ్యక్షుడిగా భాస్కర్, కార్యదర్శిగా డి.వేణుగోపాల్‌రెడ్డి, కోశాధికారిగా ఎస్.వెంకటరమణారెడ్డి ,వైస్ ప్రెసిడెంట్‌గా పి. శోభారాణి, జాయింట్ సెక్రటరీగా బి.సురేష్‌రెడ్డి ,ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె. మోహన్‌సింగ్, ప్రచార కార్యదర్శిగా టి.మల్లికార్జున్,కార్యనిర్వాహక సభ్యురాళ్లుగా శిరీష్, సుచిత శామ్యూల్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల రాష్ట్ర ఫోరమ్ అధ్యక్షుడు మహేష్, రంగారెడ్డి జిల్లా ఫోరమ్ అధ్యక్షుడు, శ్రీకాంత్ ,నాయకులు భరత్ కుమార్, ఈఎస్ఎస్ గిరికాంత్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆలస్యంగా ప్రారంభమైన పరీక్ష..

మేడ్చల్‌రూరల్: హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థులు పరీక్ష ఆలస్యంగా ప్రారంభం కావడంతో ఆందోళన చేపట్టిన ఘటన గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం చోటు చేసుకుంది. టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్ష కోసం అభ్యర్థులు ఆన్‌లైన్‌లో పరీక్ష రాసేందుకు గాను మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం జనరల్ స్టడీస్ పేపర్-1, పేపర్-2 పరీక్ష రాసేందుకు అభ్యర్థులు ఉదయాన్నే కేంద్రానికి చేరుకోగా ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన పరీక్ష బయోమెట్రిక్ తదితర సాంకేతిక కారణాలతో అరగంట ఆలస్యంగా ప్రారంభమైంది. పేపర్-2 పరీక్ష సైతం ఆలస్యం కావడంతో అసహనానికి గురైన అభ్యర్థులు పరీక్షా కేంద్రం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కారణంగా తాము భోజనం చేయకుండా పరీక్షకు హాజరు కావల్సి వచ్చిందని కొందరు అభ్యర్థులు తెలుపగా, పరీక్ష రాసేందుకు దూర ప్రాంతాల నుండి వచ్చిన తమకు తిరిగి ఇంటికి చేరుకునేందుకు ఇబ్బందులు ఎదురవుతాయని కొందరు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సమాచారం అందటంతో పేట్ బషీరాబాద్ పోలీసులు పరీక్ష కేంద్రం వద్దకు చేరుకుని అభ్యర్థులను సముదాయించారు.

మా ఎమ్మెల్యే కనిపించడం లేదు

జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నేత ఫిర్యాదు

జవహర్‌నగర్: మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి గత మూడు నెలలుగా నియోజవర్గంలో కనిపించడం లేదని దమ్మాయిగూడ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ప్రసాద్ జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనతో పాటు, తన అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి భూకబ్జా ఆరోపణల నేపథ్యంలో వారిపై పలు కేసులు నమోదు కావడంతో, కేసులకు భయపడి, నియోజకవర్గ సమస్యలను గాలికి వదిలేసి ప్రజలకు కనిపించకుండా తప్పించుకుతిరుగుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి కనిపించడం లేదని ఆయన ఆచూకీ వెతికి పెట్టాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ప్రజావాణిలో 121 అర్జీలు

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రజావాణిలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలోని ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి 121 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు .

విద్యాశాఖ అధికారిపై చర్యలు తీసుకోవాలి

సాక్షి,మేడ్చల్ జిల్లా: విద్యాశాఖ నిబంధనలను బేఖాతరు చేస్తూ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు విచ్చలవిడిగా అనుమతులు ఇస్తున్న మేడ్చల్ జిల్లా విద్యాశాఖ అధికారి విజయ కుమారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ డిమాండ్ చేశారు.

- సోమవారం కలెక్టరేట్ వద్ద అఖిల భారత యువజన సమాఖ్య (ఏ ఐ వై ఎఫ్) మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ డి. విజయేందర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు.
- విద్యాశాఖ అధికారులు నిబంధనలను ఉల్లంగిస్తూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల కు అనుకూలంగా వ్యవహరించడాన్ని ఖండిస్తున్నట్లు ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ తెలిపారు.
- కార్యక్రమంలో ఏ ఐ వై ఎఫ్ జిల్లా నాయకులు గిరి బాబు, కిరణ్, అజీమ్ పాషా, హస్మాత్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనానికి నిధులు కేటాయించాలి

సాక్షి,మేడ్చల్ జిల్లా: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10వేలు వేతనం ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు డీజే నరసింహారావు డిమాండ్ చేశారు..సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన కార్మికులు నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకిచ్చే గౌరవ వేతనం, విద్యార్థులకిచ్చే మెనూ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని ఆరోపించారు. నెలల తరబడి బిల్లులు రాకపోవడంతో అప్పు చేసి విద్యార్థుల కడుపునింపుతున్నారన్నారు. పాఠశాలలు పునఃప్రారంభం అయినా బిల్లులు రాలేదన్నారు. ధర్నాలో సీఐటీయూ నాయకులు ఉన్నికృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియకు వినతి పత్రం అందజేశారు.

ఉత్తమ ఇంజినీర్లుగా తీర్చిదిద్దేందుకు కృషి

ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: నైపుణ్యాల కొరత విద్యార్థుల ఉపాధి అవకాశాలను ఊహించని స్థాయిలో ప్రభావితం చేస్తుందని మల్లారెడ్డి విద్యాసంస్థల అధినేత, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీ సోమవారం ఎన్‌టీటీ డేటా సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు విద్యార్థులకు సేల్స్‌ఫోర్స్‌పై శిక్షణ ఇచ్చేందుకు యూనివర్సిటీ ప్రాంగణంలో ఎన్‌టీటీ డేటా సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ మల్లారెడ్డి విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులను ప్రపంచ స్థాయిలో ఉత్తమ ఇంజినీర్లుగా తీర్చిదిద్దేందుకు అన్ని రకాల సదుపాయాల కల్పిస్తున్నట్లు తెలిపారు. యూనివర్సిటీ వీసీ వీఎస్‌కే రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ పరిశ్రమలో బహుళంగా వినియోగిస్తున్న సేల్స్‌ఫోర్స్ సాంకేతికతపై విద్యార్థులకు అనుభవజ్ఞులతో శిక్షణ ఇవ్వడంతో విద్యార్థులు అధిక వేతనాలతో ఉపాధి పొందే అవకాశం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో వీసీ వీఎస్‌కే రెడ్డితో పాటు డీన్‌లు కైలాసరావు, రవీంద్ర, హెచ్ఓడీ తయ్యాబా, మీరావలి,నవీన్‌కుమార్, ఆనంద్, ఎన్‌టీటీ డేటా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలకు అడ్డుకట్ట వేయండి

కీసర: ఇంటి నిర్మాణానికి అనుమతి తీసుకుని చేపట్టిన భారీ షెడ్‌ల నిర్మాణాన్ని నిలుపుదల చేయడంతోపాటు, సదరు యజమానిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం నాగారం కౌన్సిలర్ కొమురెల్లి అనితా సుధాకర్ రెడ్డి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ నాగారం మున్సిపల్ ప్రధాన రహదారిలో ఓ వ్యక్తి రెసిడెన్షియల్ నిర్మాణంగా చూపించి షెడ్ నిర్మాణం చేపడుతున్నారన్నారు. దీంతో మున్సిపాలిటీ ఆదాయానికి భారీగా గండి పడిందన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి సదరు నిర్మాణాన్ని వెంటనే నిలుపుదల చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కాగా సోమవారం నాగారం మున్సిపల్‌కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజావాణిలో 10 ఫిర్యాదులు, దమ్మాయిగూడ మున్సిపల్‌కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 4 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు.